వయోవృద్ధుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

లక్డీకాపూల్: మధుమేహం, వయోభారంతో శరీరంలో వచ్చే మార్పులు, వినికిడి లోపం, చూపు మందగించడం వంటి సమస్యలు వృద్ధుల జీవనయానాన్ని సంక్లిష్టం చేస్తాయని సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, ప్రముఖ జెరియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ వసంత్ కుమార్ చెప్పారు. ఇలాంటి సమయంలో వారికి కుటుంబసభ్యుల చేయూతతోపాటు వైద్య సమస్యలను గుర్తించి చికిత్స అందించే జెరొంటాలజిస్ట్ (వృద్ధుల వైద్యనిపుణుల) అవసరం ఎంతో ఉందన్నారు. ఆదివారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఉచ్వాస్ ట్రాన్సిషన్ కేర్ సెంటర్‌లో ఎల్డర్ ఎయిడ్ సంస్థ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వయో వృద్ధుల అలనాపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ.. తీసుకునే ఆహారం, తేలికపాటి వ్యాయామాలు, ఆరోగ్యకరమైన జీవన విధానంతో.. సమస్యలను అధిగమించవచ్చన్నారు. వీరి విషయంలో ప్రస్తుతం ప్రివెంటివ్ మెడిసిన్, జెరొంటాలజిస్టులతోపాటు వారికి అన్ని రకాలుగా సేవలందించే సంస్థల ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. ఉచ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ ప్రతినిధులు సతీష్, పవన్, ఎల్డర్ ఎయిడ్ ప్రతినిధులు మందిరా జయసింహ పాల్గొన్నారు.

రైతులపై కేంద్రం తీరు దారుణం

హిమాయత్‌నగర్: రామరాజ్యం, దేశమంతా ఇంటింటికీ రాముడి అక్షింతలు, జై శ్రీరామ్ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్, మోదీ ప్రభుత్వం రైతులను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపుతోందని ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఉమర్, ఇంక్విలాబ్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం హుస్సేన్‌లు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కాల్చి చంపిన శుభకరన్ సింగ్ హత్యను ఖండిస్తూ ఆదివారం కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహ్మద్ జానీ ఉమర్ మాట్లాడుతూ... గతంలో మోదీ ప్రభుత్వం, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసిందని, ఆ సందర్భంగా ఇచ్చిన కనీస మద్దతు ధరకు చట్టం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతుంటే వారిపై అప్రజాస్వామ్యంగా, క్రూరంగా రబ్బరు బుల్లెట్‌లు కురిపించి ఒక యువ రైతును కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. ఇది రైతు,ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు.తక్షణం కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇంక్విలాబ్ సేన నాయకులు డాక్టర్ సలీం, కాసాని శ్రీనివాస్, సిరాజ్, ఆమెనా, ఫార్జానా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక కుల సర్వేపై చర్చా వేదిక

ఖైరతాబాద్: సంచార జాతులుగా, నిరాశ్రయులుగా ఉన్న ప్రజలను ప్రత్యేకంగా గుర్తించి కుల సర్వేలో వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మేథో మదన సభ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక కుల సర్వేపై మేధోమథనం పేరుతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఈ సర్వేలో పాటించాల్సిన విధి విధనాలు, కార్యచరణపై మేథావులు సభలో సుదీర్ఘ సమాలోచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, ప్రధాన వక్తగా మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు హాజరయ్యారు. భారతీయ ఓబీసీ సమాఖ్య అధ్యక్షుడు కె.కోటీశ్వరరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు. సంచార, అర్ధసంచార, విముక్త జాతులు, కులాలు, నిరాశ్రయులుగా ఉన్న వారు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి అందుకోలేక పోతున్న ప్రజలు, ఆధునిక అభివృద్ధికి దూరంగా ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, ఇలాంటి నిర్లక్ష్య వర్గాలను సమాజ ప్రగతిలో భాగస్వాములను చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తి అని మేథో మథనంలో సుదీర్ఘ చర్చ జరిగింది.

నిమ్స్‌లో కాంట్రాక్టు నర్సుల నియామకం

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే పనిలో యాజమాన్యం నిమగ్నమైంది. ఈ క్రమంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 300 మంది నర్సుల భర్తీకి చర్యలు చేపట్టింది. కాంట్రాక్టు ప్రాతిపదికన 300 మందిని నియమించింది. ఇందుకు అర్హులైన అభ్యర్థులు 30261 మంది దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం నుంచి వచ్చే నెల 4వ తేదీలోపు విధుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

పునరావాస కేంద్రానికి చిన్నారులు

బంజారాహిల్స్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కింద శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా దాడులు జరిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ పోలీసులు 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. చంటి బిడ్డలతో ఉన్న తల్లులు, చిన్నారులను గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించారు. వీరిలో ఒక మహిళ వద్ద శాంసంగ్ ఎస్22 వంటి ఖరీదైన సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే మరో బాలుడి తల్లి బౌన్సర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు.

విశ్వనాథ్ సినిమాలు చరిత్రలో సుస్థిరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి: దేశంలో వంద ఉత్తమ సినిమాలలో పది సనిమాలు విశ్వనాథ్‌వే ఉంటాయని ఉంటాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన శంకరాభరణం, సాగర సంగమం, స్వర్ణ కమలం, స్వాతి కిరణం వంటి భిన్న కథాచిత్రాలు చరిత్రలో సుస్థిరంగా ఉంటాయని కొనియాడారు. కళానియం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో కె.విశ్వనాథ్ జయంతి సందర్భంగా స్వర్ణకమలంలో నటించిన షరాన్ లోవెన్‌ను జస్టిస్ రాధారాణి సత్కరించి మాట్లాడారు. అమెరికా దేశీయురాలైన షరాన్ లోవెన్ భారతీయ నాట్య ప్రక్రియలపై అధ్యయనం కోసం వచ్చి ఒడిస్సీ, కథక్ వంటి నాట్యాలలో పరిణితి సాధించి స్వర్ణకమలంలో నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారని ప్రసంసించారు. షరాన్ లోవెన్ మాట్లాడుతూ... ప్రతి దేశానికి కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాథమిక లక్షణాలు అన్నారు. తనకు తన అమెరికా సంస్కృతి పట్ల గౌరవం ఉందని అలాగే భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రాథమిక లక్షణాలు ఆదర్శమన్నారు. విశ్వనాథ్ కుమారుడు నాగేందర్ మాట్లాడుతూ... తమ తండ్రి చివరి రోజుల్లో ఎక్కువ సార్లు స్వర్ణకమలం సీడీ చూసేవారని చెప్పారు.

1 నుంచి బీసీల మహా పాదయాత్ర

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి చేపట్టనున్న మహా పాదయాత్ర పోస్టర్‌ను ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, హిందూ బీసీ మహాసభ, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం మిర్గాన్ పల్లె నుంచి మహాయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. 23 రోజుల పాటు 360 కిలోమీటర్ల సాగే మహా పాదయాత్ర జనగామ జిల్లా ఖిలాషాపూర్ వరకు జరుగుతుందని తెలిపారు. నేతలు బత్తుల సిద్దేశ్వర్లు, ఎర్ర శ్రీహరి గౌడ్, గిరగాని భిక్షపతి, దుబ్బకోటి అంజనేయులు, బత్తుల రామనర్సయ్య, కొంగర నరహరి, పర్వత సతీష్ కమార్, చింతలగారి వెంకట స్వామి, పంతుల మల్లయ్య, కె.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి

- పరిష్కరించాలనే ఆలోచన అధికారుల్లో కనుమరుగు
- విన్నవించినా.. వేడుకున్నా అధికారులు స్పందించరెందుకు?

సమస్యలన్నీ విద్యార్థులెరుగు!

పరిష్కరిస్తారో లేదో దేవుడెరుగు!

జర చూడు సమస్యలు విని!

- ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిసినా పట్టించుకోరు
- విద్యార్థుల ఇబ్బందులను చూసి ప్రైవేట్ స్కూళ్లలో వేస్తున్న తల్లిదండ్రులు



తరగతి గదులు లేక బయట చదువుకుంటున్న విద్యార్థులు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. కానీ సర్కారు బడుల్లో సరైన సౌకర్యాలు పెంచేందుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. బడిలో సరైన వసతులు కల్పిస్తే విద్యార్థుల చదువు సజావుగా సాగుతుంది. వసతుల లేమితో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి సన్నగిల్లుతోంది. తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలకు వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. తమ పిల్లల ప్రాణాలకు ప్రమాదమని తెలిసీ సర్కారు బడికి ఎలా పంపించాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోతే భవిష్యత్‌లో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోతారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ అధికారులు స్పందించి సర్కారు బడులకు మరమ్మతులతో పాటు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

మూసాపేట: గతంలో వర్షం వస్తే ప్రభుత్వ పాఠశాలకు సెలవు ప్రకటించేవారు. ఎప్పుడు వర్షం వస్తుందా అని అప్పటి కాలంలో విద్యార్థులు ఎదురుచూస్తూ ఉండేవారు... అదే పరిస్థితి ప్రస్తుతం మూసాపేటలో నెలకొంది. ఏ చిన్న వర్షం వచ్చినా మూడు నుంచి నాలుగు తరగతి గదులకు సెలవులు ప్రకటించాల్సిందే. మధ్యాహ్నం సమయంలో వర్షం వచ్చినా వారిని ఇంటికి పంపే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితి మూసాపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నెలకొంది.

మొరపెట్టుకున్నా స్పందించరు...

- తరగతి గదులు లేక సంవత్సరాల తరబడి నెలకొన్న ఇబ్బందులను పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటూ వస్తున్నారు. తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతున్నాయని.. పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని.. విన్నవించినా వారి గోడును వినిపించుకోవటం లేదు. దీంతో చేసేది ఉపాధ్యాయులు వరండాలో, చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆరు తరగతి గదులతోనే నెట్టుకొస్తున్న వైనం..

- పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 419 మంది విద్యార్థులు చదువుతున్నారు. కరోనా తరువాత పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరిగింది. అయితే విద్యార్థులకు సరిపడా తరగతి గదులు మాత్రం లేవు. ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం కలిపి 10 తరగతులకు గాను 6 తరగతులు మాత్రమే ఉన్నాయి. ఇంకా 4 తరగతి గదులు కావాలని కోరుతున్నారు. పాఠశాల భవనంపై రెండంతస్తులు నిర్మించి నాలుగు తరగతి గదులు కేటాయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలోని సమస్యలు..

- రెండు డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ క్లాస్, లైబ్రరీ అన్ని ఒకే తరగతిలోనే ఉంటాయి.
- పాఠశాల ఉపాధ్యాయులకు వెయిటింగ్ హాలు లేక అదే తరగతి గదిలో విశ్రాంతి తీసుకుంటుంటారు.
- బెంచీలు కూడా సరిపడా లేవు. దీంతో తరగతి గదిలోనే క్రింద నేలపై కూర్చొని పాఠాలు వింటున్నారు.
- అంతేకాకుండా కరెంటు స్విచ్ బోర్డులు పగిలిపోవటం, బండలు పగిలిపోయి ఉన్నాయి.
- అదే విధంగా పక్కనే ఉన్న ప్రైమరీ పాఠశాలలో 5 తరగతి గదులకు, ఉపాధ్యాయులకు కలిపి రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి.
- గతంలో ఎప్పుడో నిర్మించిన ఈ పురాతన భవనం పెచ్చులు ఊడిపోయి, భవనంపై పిచ్చి మొక్కలు పెరిగి ఎప్పుడు కూలిపోతుందోనన్న స్థితిలో ఉంది.
- కరోనా తరువాత ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల చేరికలు పెరిగినప్పటికీ సౌకర్యాలు లేకపోవటంతో మళ్లీ ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.
- అత్యుత్తమ ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతులు ఉన్నప్పటికీ పాఠశాలలో సౌకర్యాల లోపంతో ఇబ్బందులు పడుతున్నారు.
- సమస్యలను పరిష్కరిస్తే విద్యార్థులు చదువుపై దృష్టి సారించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.
- గతంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్న జయప్రకాష్ నారాయణ పాఠశాలకు అదనపు గదులకు నిధులు మంజూరు చేసినప్పటికీ స్థలం లేక నిధులు వెనక్కు వెళ్లిపోయాయి.





ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను పేద, మధ్య తరగతి వారు సద్వినియోగం చేసుకోవాలని... ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం కమల ప్రసన్ననగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీశ్రీహోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఉచితంగా రక్త పరీక్షలు, జనరల్, దంత వైద్య, బీపీ, షుగర్, గైనకాలజిస్ట్, ఆర్థో, ఈసీజీ, ఈఎస్‌టీ వంటి సేవలు ఒకేచోట ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, కమలప్రసన్న నగర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యేగాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

విద్యతో పాటు ఆరోగ్యం గురించి తెలియజేయాలి



విద్యార్థుల రక్త నమూనా పరీక్షల్లో పాల్గొన్న గోపిశెట్టి రాఘవేందర్

మోతీనగర్: బాల్యదశలోనే విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్య విషయాలను నేర్పటం గౌతమ్ మోడల్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న ప్రయత్నం ఎంతో హర్షించదగ్గ విషయమని అవంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి రాఘువేందర్ పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్‌లో సుమారు వందమందికి గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నర్వహించారు. వారి రక్త నమూనాలు సేకరించి వారు ఏ గ్రూప్‌కు చెందిన వారో తెలిపారు. అదే విధంగా బీపీ, మధుమేహం ఉన్న వారికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి, నర్సింహ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలను ఓడించాలి

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న అగ్రకుల పార్టీలను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం చేస్తున్న కుటిల రాజకీయంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా దళితులను అణిచివేయాలని రాజ్యాధికారం చేపట్టకుండా ఉండేందుకు 19 ఏళ్ల క్రితం సుప్రీం కోర్ట్ కొట్టివేసినా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మళ్లీ బీజేపీ ప్రభుత్వం సుప్రీం కోర్ట్ ద్వారా వర్గీకరణ చేయడానికి కుట్రలు చేస్తున్నారని వారు ఆరోపించారు. దీనిద్వారా బీజేపీ రాజకీయ లబ్ధి కోసం దళితుల విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ భాస్కర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షల రాజు, నక్కా దేవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.బాలస్వామి, వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు రాజు

అబాకస్, వేదిక్ మ్యాథ్స్ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూల్‌లో ఆదివారం అబాకస్, వేదిక్ మ్యాథ్స్ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలను నిర్వహించారు. దీనికి రాష్ట్రం నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షలకు ముఖ్య అతిథిగా ట్రస్మా సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు విచ్చేసి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మేధస్సు పెంపొందించడానికి ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వం సంస్థ డైరెక్టర్లు, సీతాఓ, మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఏసీపీకి శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుని ఆదివారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాథ్ యాదవ్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగణేష్‌నగర్ అధ్యక్షుడిగా పన్నాల రాజశేఖర్‌రెడ్డి విజయం



మోతీనగర్: శ్రీగణేష్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా పన్నాల రాజశేఖర్ రెడ్డి విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఎన్నికలో గోపాల్‌సింగ్, ప్రసాద్‌గౌడ్‌లపై రాజశేఖర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి పోతురాజు నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న ఆలయ అభివృద్ధితో పాటు, భక్తులకు సకల సౌకర్యాలు అందే విధంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కాలనీలో తాగునీరు సరఫరా నిరంతరాయంగా అందిస్తామని హామీ ఇచ్చారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో అలీఖాన్‌కు రజత పతకం

బంజారాహిల్స్: కేరళలో నేషనల్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ ఈ నెల 23 నుంచి 25 తేదీ వరకు నిర్వహించిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ అండ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ పోటీల్లో హైదరాబాద్‌కి చెందిన మహమ్మద్ అలీ ఖాన్ మిస్టర్ సౌత్ ఇండియా కేరళ రజత పతకాన్ని సాధించారు. తెలంగాణ నుంచి ఈ పతకాన్ని సాధించిన యువకుడిగా అలీఖాన్ గుర్తింపు సాధించాడు. దేశ వ్యాప్తంగా ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుంచి 15 మంది పాల్గొనగా అలీ ఖాన్ రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. సౌత్ ఇండియా బిగ్గెస్ట్ ఈవెంట్‌గా తాను ఈ పోటీలలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అలీ ఖాన్ తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో గత ప్రభుత్వం హయాంలో వివిధ అభివృద్ధి, నాలా నిర్మాణ పనులను మంజూరు చేశామని.. కానీ ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజవకర్గంలోని బోయిన్‌పల్లిలో మానస సరోవర్ నుంచి సాయినగర్ ఎన్‌క్లేవ్ వరకు రూ.4కోట్లు, అల్లాపూర్ సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు పనులకు రూ.55కోట్లు, బాలాజీనగర్‌లోని ఐడీఎల్ నాలా నుంచి కూకట్‌పల్లి నాలా వరకు సర్ప్లస్ పనులకు రూ.22కోట్లు, కూకట్‌పల్లి ఏవీబీపురం నిసాన్ సర్వీస్ సెంటర్ పనులకు రూ.30 కోట్లు, ఫతేనగర్ నాలా రిటర్నింగ్ వాల్ ఏర్పాటు కోసం రూ.12 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు.

- ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను కోరారు. అదే విధంగా నియోజకవర్గంలోని పలు నాలా అభివృద్ధి పనులను కూడా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. ఫతేనగర్ డివిజన్ కూకట్‌పల్లి డిపో నుంచి గౌతంనగర్ వరకు రూ.91 కోట్లు, బోజై కల్యాణ మండపం కల్వర్టు నుంచి గౌతంనగర్ వరకు రూ.20కోట్లు, కేపీహెచ్‌బీకాలనీలోని గోపాల్‌నగర్ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు నాలా పనులకు రూ.79 కోట్లు, బాలానగర్‌లోని కెమికల్ నాలా రూ.30 కోట్లు పనులకు నిధులు మంజూరు చేసి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

వేడుకగా అట్టుకల్ పొంగల్



వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని దేవీనగర్‌లో నివాసముంటున్న మళయాళీలు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలో చేసుకునే అట్టుకల్ పొంగల్ పండుగను మహిళలు సంప్రదాయబద్ధంగా చేసుకుంటారు. అరటిపండ్లు, బెల్లం, నెయ్యితో తయారు చేసిన వంటకాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆదివారం నిర్వహించిన ఈ వేడుకకు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవీనగర్‌వాసులకు అట్టుకల్ పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎంకే బాబు, నవోద్య, విజయ్ కుమార్, మంగళన్, అప్పచెన్, మేఘ, రమేష్, కాంగ్రెస్ నాయకులు మేకల సుదర్శన్, మేకల రమేష్, యుగంధర్, నరేందర్, చున్నూ పాషా, నయిమ్ మొహమ్మద్, కావేటి నాగార్జున, కృష్ణవేణి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ మసీదు వద్ద సీసీ రోడ్డు కోసం గతంలో రూ.17లక్షల నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయి. ఈ పనులను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించి మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేసి మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్ గౌడ్, మల్లేష్, నరసింహులు, నాగరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌నగర్ మసీదు పూర్తయిన సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మూసాపేట: మూసాపేట ఆంజనేయనగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం కిడ్డీ మౌంట్ లిటేరా స్కూల్ వార్షికోత్సం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ గిరిడ చిన్నారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు సాంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించారు. సినిమా, భక్తి గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కథలు, నాటికాలు చెప్పటం విద్యార్థుల తల్లిదండ్రులను అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి, ఉపాద్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



